# -: సంక్రాంతి :-

రచన : శ్రీ ఎ. వి. సీతారామమూర్తి

రగులుతోంది ! లోలోన మంట రగులుతోంది !! సుబ్బారావు కడుపులో ఆకలిమంటలు రగులుకొంటున్నాయి !... పండగొస్తోంది !! యేడాది తర్వాత మళ్ళి వస్తోంది!! పేదరికాన్ని సంఘంముందు రుజువు చేసే పండగ పరుగెత్తుకు వస్తూంది!! అందరికీ పండుగ కాదు డబ్బున్న వాళ్ళకి పండగ-జల్సా చేసే పండగ.

ఆనందంగా గంతులేస్తున్నాడు పక్కింటి ఆనందరావు కొత్తసూటు కుట్టించుకున్నాడు-కుట్టించుకోకేంచేస్తాడు? నవ్వుతూ గంతులేయకేంచేస్తాడు? తను చదివిన చదువుకు న్యాయాన్ని చేకూర్చక ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ప్రభుత్వం నిర్మించిన వంతెనను యిట్టే చేకూర్చేసి ప్రజల ధనం దోచుకున్న ఆనందరావు నవ్వుతూ వుండకేం చేస్తాడు?

ఎండ వేడిగానుండి ఆరిపోయింది! చలి చుట్టూ అలుముకుంది - కాళ్ళు చేతులూ గజగజలాడే చలి! వెన్నెల్లా వుండే ట్యూబ్ లైట్ కాంతిలో మంచు చల్లగా తెల్లగా కురుస్తూంది!! స్తబించినగాలిని చెట్లు విసురుతున్నాయి. దూరంగా బోగిమంట కొరకు కుర్రాళ్ళ కేకలు, పాటలు వినిపిస్తున్నాయి.!

ఉద్యోగం, డబ్బులేని సుబ్బారావు దగ్గరకు చలి చల్లగా వచ్చి చేరింది-పండగ పరుగెత్తుకుంటూ వస్తూంది. ఆకలి ఆవురావురు మంట గోలచేస్తూంది!!.

ఎదురింటి డాక్టరు కారుదిగి సూట్‌తో ఇంట్లోకి పోతున్నాడు — "డాక్టరు!!!" గొణుక్కున్నాడు. సుబ్బారావు-దూరంగావుండకేంజేస్తాడు ?

రెండు చేతులా డబ్బు ఆర్జిస్తున్నాడు - పెద్దపెద్దవారి కేసులేగాని చిన్నవాటి జోలికి పోడు! రాత్రి పది దాటితే పక్కింటివాడు చస్తున్నా కదిలి వెళ్ళని నిద్ర దేవతా లోలుడు!!

అడది నొప్పులు పడుతూందని రిక్షాలో తీసుకువస్తే చూట్టానికే పదిరూపాయలు కావాలనే ప్రజాసేవకుడు.

అతనికేం! ఏంతక్కువ? పండగకో కొత్త కారు! చలికో ఎయర్‌కండిషన్ గది! ఆకలెరుగని కడుపు-ఉద్యోగ భాద తెలియని ప్రజాసేవ!!

కటికనేల-చింకిగుప్పటిమధ్య సుఖమెరుగని నిద్రలోని సుబ్బారావుకి పిల్లల కేకలు విని ఉలికిపడి లేచాడు - చీకట్లింకా మాసిపోలేదు:—

మంట ఎర్రగా మండుతోంది!! చుట్టూ చిన్న పిల్లలు అందమైన బట్టలు వేసుకొని తుళ్ళుతూ, కేరింతలు కొడుతూ చలికాస్తున్నారు-భాధ, ఆకలి, చలి. ఎరుగని పసి మనసులు!!

మంట ఎర్రగా ఆవులించి సంతృప్తి పొందుతుంది:-

సుబ్బారావు కడుపు మండుతూంది-రెండురోజులుగా ఖాళీగా పడివున్న కడుపు!! పేగులు చుట్టుకు పోతున్నాయి! నోరు రుచిని మర్చిపోయింది-మనసు, శరీరం సుఖాన్ని మర్చిపోయినట్లు:-

మంట దగ్గరగా వెళ్ళాడు సుబ్బారావు-కంట్లో నీరు తిరిగింది. పిల్లలంతా తనవైపు చూసి నవ్వుతున్నారు.

తూర్పున ఎర్రగా మండుతూ కన్పించాడు సూర్యుడు పిల్లలంతా వెళ్ళిపోయారు-మంట ఆరిపోయింది-మిగిలిన బూడిద వెక్కిరిస్తూంది! సుబ్బారావు కడుపులో మంట ఆరలేదు-అతను మాత్రమే మిగిలాడు బూడిదలా యీ భూమ్మీద!!!



*

'నా దేశం'లో

ఎం. కె. విజయా

ధూళిపాళ

మాలతి.